# జీవుడు దేవునితోకూడినప్పుడు అక్షరస్వరూపుడౌతాడు

దేవుడన్న పదము తెలియునందరికిని
పదముతెలిసినంత మూటయేమి
దేవుడన్నవాని చేరి సేవించిన
దేవుడన్న పదము తెలియునయ్య
    మంచి తలపులు మాటలు మంచి చేత
    మంచి వినికిడి చూపులు మంచితనము
    మంచి ఆరోగ్యములనిచ్చు మానవులకు
    సత్యమును తెల్పుఊట యీ సాయిమాట

ఆధ్యాపకులారా! విద్యార్థులారా!

సనాతనకాలమునుండి యీ ప్రపంచమున దేవుని తెలుసుకొనే నిమిత్తమై అనేక విధములైన ప్రయత్నములు జరుగుతూనే వున్నవి. దేవుడనగా ఎవరు అనే ప్రశ్న గానీ, ఈ దేవుడెక్కడున్నాడు అనే ప్రశ్నగాని యీ నాటిదికాదు. సృష్టి ఆదినుండియు యీ జటిలమైన ప్రశ్నకు సమాధానముకొరకు అనేక విధములైన సాధనలు సలుపుతూ వచ్చారు, మహర్షులు. కఠిన దీక్షను పూని కారడవులకేగి, నిద్రాహారములు మాని, యీ దైవత్వమును అన్వేషించాలని అనేక శ్రమలకోర్చి కొంతమంది యీ సత్యాన్ని గుర్తించారు. 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అనే సత్యాన్ని వారు గుర్తించి మానవునియొక్క ప్రయత్నం దైవముయొక్క అనుగ్రహంచేత సాఫల్యం కాగలదనే విశ్వాసముతో వారు యీ దీక్షకు పూనుకున్నారు. నడచుటకు ప్రయత్నము చేసిన చిన్న చీమ అయినాకూడను కొన్నిమైళ్ల

sri sathyasai vachanamrutam

దూరం ప్రయాణంచేయగలదు. ఇష్టమే లేకుండిన, శ్రద్ధయే కల్గకుండిన గ్రద్దయైనాకూడను ఒక్కయించి ముందుకు నడవలేదు. కనుకనే 'శ్రద్ధావాన్‌లభతే జ్ఞానమ్' అన్నారు. శ్రద్ధ కల్గినవాడు యెంతటి జటిలమైన సమస్యనైనా సులభముగా తీర్చుకొని ఆనందించి సుఖశాంతులను అందుకోగలడు.

**దైవమనే చిన్మయ స్వరూపుడు మృణ్మయమైన దేహమునందే వున్నాడు**

దైవత్వాన్ని గుర్తించిన మహనీయులు, ఋషులు "దేదీప్యమానమైన, ప్రకాశవంతమైన పురుషుని మేము చూడగల్గాము, అజ్ఞానమనే అంధకారమునకు ఆవలనున్న మహాపురుషుని మేము దర్శించగలిగాము. కోటిసూర్యులకాంతితో వెలిగే దివ్యజ్యోతిని మేము అనుభవించగల్గాము", అని ప్రజలకు చాటుతూ వచ్చారు. అదే ప్రప్రథమమున ప్రపంచమునకు బోధించిన వేదముయొక్క సారము. దానినే 'వేదాహమేతం పురుషం మహాంతం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అన్నారు. తేజోవంతుడై, ప్రకాశవంతుడై, అజ్ఞానమనే అంధకారమునకావలవున్న మహాపురుషుడు యితడే! అని ఉద్ఘాటించారు. మానవునియందు అజ్ఞానము, అంధకారము యేనాడు పటాపంచలైపోవునో ఆనాడే యీ పవిత్రమైనజ్యోతిని, ఆత్మజ్యోతిని, ఆనందజ్యోతిని, అద్వితీయజ్యోతిని అందుకోగలడని వారు చాటుతూ వచ్చారు. అయితే యీ మహర్షులు యెక్కడ చూచారు? బయట ప్రపంచములో చూశారా? కాదు, కాదు. పంచకోశములను పరిశీలించి, పంచప్రాణములను విచారించి మానవునియందు యీ దివ్యతేజోవంతమైన తత్త్వము వారివారి హృదయములందే వారు గుర్తించగల్గుతూ వచ్చారు.

దైవప్రీతికల్గినవారు అన్నింటికంటే సమీపుడు భగవంతుడని గుర్తించారు. దైవప్రీతిలేనివారికి యెంత దూరముందో అంతకంటే యింకా దూరమైన వానిగా గోచరిస్తూ వచ్చాడు, భగవంతుడు. మాణిక్యము మట్టిలో దొరుకును గాని, మ్రానులో రాదు. మట్టిలో వెదుకవలసిన మాణిక్యాన్ని మ్రానులో వెతకటానికి ప్రయత్నంచేసే మానవునికి అది యేరీతిగా లభ్యమౌతుంది? భూమి శబ్ద, స్పర్శ, రూప, రస గంధములతోకూడినది. మట్టి, నీరు, నిప్పు, గాలి, ఆకాశము వీటితో కూడినది యీ ప్రపంచము. మానవుని

sri sathyasai vachanamrutam

శరీరముకూడను మట్టితో, నీటితో, నిప్పుతో, గాలితో, ఆకాశమనే శబ్దముతోకూడినదే. కనుకనే యీ దివ్యమైన మాణిక్యమును, దివ్యత్వమైన చిన్మయత్వాన్ని, యీ మృణ్మయములోనే మనము వెతకాలి. దైవమనే చిన్మయస్వరూపుడు ఎక్కడ వున్నాడంటే, మృణ్మయమైన దేహమునందే వున్నాడనే సత్యాన్ని ఆ ఋషులు గుర్తించారు.

## దేహము ఆత్మదేవునకు ఒక గొప్పమందిరము

'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' అన్నాడు, శ్రీ కృష్ణుడు భగవద్గీతలో. 'మమైవాంశో' అన్నాడు. ఇంద్రియాంశముగాని, మానసాంశముగాని, ప్రకృతాంశముగాని కాదు. జీవాంశముకూడా కాదు. 'మమైవాంశో', నా అంశమే! సాక్షాత్తు నా అంశమే యీ మానవునియందు దేదీప్యమానముగా హృదయమునందు వెలుగుచున్నదన్నాడు. ఈ సత్యాన్ని గుర్తించిన మహర్షులు ఆనాటినుండి యీ దేహమును 'దేహో దేవాలయ ప్రోక్తో జీవో దేవఃసనాతనః' అన్నారు. అనగా 'సనాతనమైన దేవుడు జీవరూపములో యీ నూతనమైన దేహములో విలసిల్లుచున్నాడు', అని నిర్ణయించుకున్నారు. దేహమనగా కేవలము సామాన్యమైనదికాదు. ఆత్మ దేవునకు యిది ఒక గొప్ప మందిరము. ఇదే గొప్ప దేవాలయము. 'దేహోదేవాలయః' యిది దేవాలయమువంటిది. అయితే యీ దేవాలయములో వుండే దేవుని దర్శించటానికి కొన్ని నియమములుంటున్నాయి. కొన్ని మార్గములుకూడా వుంటున్నాయి. లోకములో గొప్ప గొప్ప భవనములకు అధికారులయిండ్లకు, రాజులయొక్క నివాసమునకు ముఖ్యద్వారమునందు వాచమెన్ కాపలాకాస్తూ వుంటాడు. అధికారులయిండ్లకు, శ్రీమంతులయిండ్లకు, రాజులయిండ్లకు యీ విధంగా కాపలాదారులు కావలి కాస్తున్న తరుణంలో అందరికి ఉత్తమమైన, ప్రపంచమునకే నాయకుడైన, అండపిండ బ్రహ్మాండమునే హస్తమునందుంచుకొన్న యీ భగవంతుని భవనమునకు కాపలాదారులు వుండనక్కరలేదా? ఆ ఆత్మదేవుని దర్శింపవలెనన్న, యీ దేహమనే దేవాలయములో ప్రవేశించవలెనన్న, దీనికి నాల్గుద్వారములు ఉంటున్నాయి. ఒక్కొక్క ద్వారమువద్ద ఒక్కొక్క మహాబలవంతుడైన, తేజముతోకూడిన, దైవాజ్ఞతో నియమింపబడిన ధీరుడు ఒక్కొక్కడు కాపలాకాస్తూ

sri sathyasai vachanamrutam

వుంటాడు. మొదటిద్వారమువద్ద నున్న కాపలాదారుని పేరు శమము. రెండవ ద్వారమువద్దనున్న కాపలాదారుని పేరు విచారణ. మూడవకాపలావాని పేరు తృప్తి. నాల్గవ కాపలావాని పేరు సత్సంగము.

**ఇంద్రియములను వశంచేసుకున్నవాడు పశుపతి; ఇంద్రియములకు వశమైనవాడు పశువు**

మొట్టమొదట శమమనే మంచి దృఢమైన భగవద్విశ్వాసము కల్గిన కాపలాదారుని మనం చూడాలి. దీనియందు ప్రవేశించవలెనన్న యీ కాపలాదారుని అనుమతి మనం పొందాలి. వారిని మనం స్వాధీనం చేసుకోవాలి. అప్పుడే యిందులో ప్రవేశించుటకు అధికారి కాగలడు. 'శమము' అనగా లోకరీతిగా అంతరింద్రియముల తత్వాన్ని అణగద్రొక్కుకోటం. కాని, ఇది సరైన అర్థంకాదు. అంతర్‌బహిరింద్రియాల తత్వాన్ని నిర్మూలముచేసే మానసిక తత్వాన్ని అరికట్టేవాడు శముడు. అనగా ఏకాదశరుద్రుణ్ణి తన స్వాధీనమునందు ఉంచుకున్నవాడు, యీ శముడు. ఏకాదశరుద్రుడనగా ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములు మరియు మనసు. యీ పదకొండు తత్వములకు యేకాదశరుద్రుడని పేరు. జ్ఞానేంద్రియములను అరికట్టుకున్నప్పుడు యీ కర్మేంద్రియములు సులభంగా మన వశమైపోతాయి. కర్మేంద్రియముల ద్వారా జరిగేది యేమీలేదు. కనుక, సర్వేంద్రియములయొక్క తత్త్వాన్ని అరికట్టినవాడే శముడు. ఈ శముని మనము వశము చేసుకోవాలంటే మనముకూడా శమునియొక్క తత్వాన్ని గుర్తించి వర్తించాలి. అనగా క్రమక్రమేణా మన యింద్రియములను స్వాధీనము చేసుకొనుటకు తగిన కృషి చెయ్యాలి. ఇంద్రియములను స్వాధీనం చేసుకున్నవాడు master కాని యింద్రియములకు స్వాధీనమైనవాడు slave, బానిస. నీవు master గా తయారుకావాలి గాని, slaveగా తయారుకారాదు. నీవు యింద్రియములను వశం చేసుకున్నప్పుడు పశుపతిగా మారతావు. ఇంద్రియములకు నీవు వశమైనప్పుడు పశువుగా మారతావు. దురదృష్టవశాత్తు పశుపతిగా మారవలసిన మానవుడీనాడు పశువుగా మారి తన ప్రవర్తనను మానవత్వానికి దూరం చేసుకుంటున్నాడు. అనేక జన్మలుగా యీ లౌకిక భోగభాగ్యములనుభవించి, దానియందే ఒక నిత్యసత్యమనే విశ్వాసము నభివృద్ధి చేసుకొని,

srisathyasaivachanamrutam

వాటి నిమిత్తమై అఱ్ఱులు చాచి ఆరాటపడుతున్నాడు, మానవుడు.

ప్రేమస్వరూపులారా! పశుపక్షిమృగాదులుకూడను బాహ్యేంద్రియముల ద్వారా భోగభాగ్యములననుభవించి, అనేక విధములుగా తమ ఆశలను నెరవేర్చుకొని తాముకూడా జీవిస్తున్నాయి. కానీ 'జంతూనాం నరజన్మదుర్లభం' అని, మానవుడు చాలా వుత్కృష్టమైనవాడు, పవిత్రమైనవాడు. సౌజన్యము, సౌశీల్యములతోకూడిన మానవునిగా రూపొందవలసిన మానవుడు తానుకూడను పశుపక్షిమృగాదులవలె యింద్రియములకు వశము కావటం సరైనదికాదని ఖండిస్తూ వచ్చారు, మహర్షులు. దీనిని వశంచేసుకొనే విధానం యేమిటి? 'నేను, నాది' అని యీ ఆవరణస్వరూపమైన దేహాన్ని తాను ప్రధానమైన లక్ష్యమునందుంచుకోటంచేత యీ దేహానందనిమిత్తమై తాను అనేక విధములుగా బాధపడుతున్నాడు. కేవలం మట్టి, నీరు, నిప్పు, గాలితోకూడిన యీ దేహము జడమైనదిగాని చైతన్యస్వరూపంకాదు కదా! జడమైన యినుముకూడను అయస్కాంతమునకు దగ్గరచేరినప్పుడు తాను దానిని కదలింపజేస్తుంది. అదేవిధముగనే చిన్మయరూపుడైన ఆత్మతత్త్వము లోపల వుండటంచేత యీ జడమైన దేహంకూడను ఆ చైతన్యంచేత కదులుతూ వుంటుంది. అంతమాత్రంచేతనే నేను చైతన్యస్వరూపుడను అని భావించటము వెఱ్ఱితనము. చైతన్యమనేది లోపలఉండి యీ జడమైన దేహముచేత అన్ని విధమైన పనులు చేయిస్తూ వుంటుంది.

**'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనే భావనతో కర్మలు ఆచరించినప్పుడు ఇంద్రియనిగ్రహము సులభసాధ్యమవుతుంది**

మానవుడు ఈ సృష్టిలోని సమస్త పదార్థములు తన ఆత్మతృప్తి నిమిత్తమై అనుభవిస్తున్నాడేకానీ ఆ పదార్థముల తృప్తికోసంకాదు. ఇది ఒక పుష్పము. ఈ పుష్పమును నేను వాసన చూస్తున్నాను. నా నిమిత్తమై యీ పుష్పమును నేను హస్తమునందుంచుకున్నాను గాని పుష్పము నిమిత్తమై యీ హస్తమునందు ఉంచుకోలేదు. నా నిమిత్తమై నేను భోజనము చేస్తున్నానే గాని భోజన నిమిత్తమై నేను భోజనం చేయటంలేదు. అన్నీ నా నిమిత్తమై, నా నిమిత్తమై.... ఆ 'నేను' అనేది యెవరు? అదే మనం

srisathyasaivachanamrutam

విచారణ చేయవలసినది. అదే ఆత్మతత్త్వము. అంతా ఆత్మతృప్తి నిమిత్తము మనమాచరిస్తున్నాము. కాని దేహ తృప్తి నిమిత్తం కాదు. ఈ సత్యాన్ని మనం గుర్తించి సర్వకర్మలుకూడను భగవత్ప్రీత్యర్థం అనే విషయంలో మనం దీనిని అనుభవించినప్పుడు యిదియే ఇంద్రియ నిగ్రహమునకు సులభమైన మార్గము. ఏ పనైనా చేయండి, అది అంతా దైవముయొక్క పని అని భావించండి. Work should be transformed into worship. ఏ పదార్థముకూడను శాశ్వతమైనదికాదు. క్షణభంగురమైనదే! కనుక, నిత్య సత్యమైన ఆత్మతత్త్వాన్ని మనం గుర్తించాలనుకున్నప్పుడు మనం ప్రతికర్మను ఆత్మార్పితబుద్ధితో నిర్వర్తించటం ప్రథమ సాధన. కేవలం దేహవాంఛ లేక స్వప్రయోజనముతో ఆచరించే కర్మలన్నీకూడా భగవంతునికి అత్యంతదూరమై పోతాయి. ఈ స్వార్థము, స్వప్రయోజనము అనే సంకెళ్లను త్యజించి యేనాడు దైవభావముతో కర్మలను ఆచరించెదమో అదే మనకు నిజమైన స్వర్గము, నిజమైన freedom, నిజమైన liberation. అప్పుడే యీ శమము అనే ద్వారపాలకుడు మనకు స్వాగతము యిచ్చి ప్రవేశింపచేస్తాడు.

**భగవంతునితో సన్నిహితసంబంధము పెంచుకోవాలంటే ఇంద్రియ నిగ్రహమును పాటించాలి**

యింద్రియనిగ్రహము గావించినవాడు భగవంతునికి అత్యంత ప్రీతికరమైనవాడు. ఇతనే near and dear. తన స్వంతవానిని యే ద్వారమువద్ద అడ్డుపెట్టటానికి యెవరికి అధికారములేదు కదా! ద్వారమువద్ద యే బయటివారో, క్రొత్తవారో వచ్చినప్పుడు మాత్రమే అడ్డం పెట్టగలడు. రాజకుమారులు, రాజసంబంధీకులు, రాజుయొక్క బంధువులు, రాజుయొక్క సోదరులు వచ్చినప్పుడు యెవరుకూడను అడ్డుపెట్టరు. కనుకనే భగవంతునితో సన్నిహితసంబంధ బాంధవ్యాన్ని అనుభవించటానికి మనం యీ యింద్రియ నిగ్రహాన్ని పాటించాలి. దీనిని దైవార్పిత భావముతో ఆచరించటం యీ వయస్సులో అత్యవసరం. ఇది పునాదివంటిది. ఈ పునాది గట్టిగా వున్నప్పుడే భవిష్యత్తు అనే భవనమునకు భద్రత చేకూరుతుంది. ఈ ఫౌండేషన్ సరైన స్థితిలో వేయకపోతే భవనం యే క్షణములోనైనా



srisathyasai vahinamrutam

కూలిపోవటానికి అవకాశముంటుంది. బ్రహ్మచర్య ఆశ్రమమనేది జీవితానికి పునాది వంటిది. దీనిని యీనాటినుండి భగవదర్పితముగా భావించి పోషించుకోటం అత్యవసరం. ఇప్పటినుండే భగవదన్వేషణ సల్పటం మనకు అత్యవసరం. ఎప్పుడో రిటైర్ అయిన తరువాత, old age వచ్చిన తరువాత అప్పుడింకో పని వుండదు, అప్పుడు జపం చేసుకుంటూ కూర్చోవచ్చుననుకుంటే యిది సాధ్యంకాదు.

**పదపదమంచు కింకరులు పాశములాగెడి వేళ బంధువుల్**
**దబదబ బయటపెట్టుడిక లాభము లేదని చెప్పువేళ**
**ఆలుబిడ్డలు లబలబ యేడ్చువేళ**
**తరమా! హరినామము నోటపల్కగన్**

"మరే! అప్పుడు చూచుకుందాము లే యీ నామము. భార్యా బిడ్డలారా! యేడ్చకండి. యమధర్మరాజా! కొంచెం దూరంగా వుండు, నేను జపం చేసుకొనావా"లంటే వాడు విడుస్తాడా? ఏనాటికి విడువడు. ఈనాటినుండియే మనం ప్రారంభించాలి. అప్పుడే ఆ యమధర్మరాజుకు దగ్గర రావటానికి వీలుండదు. నీకు డౌట్ రావచ్చును, అసలు యమధర్మరాజు అనేవాడు వున్నాడా అని. యముడనగా కాలుడే. ఆ కాలుడే కాలము. అనగా కాలమే మనయొక్క యమధర్మరాజు. కాలము వచ్చి మనలను లాగుకొని పోతూవుంటుంది.

కనుక మనయొక్క పాశములు మనమే వేసుకుంటున్నాము. లోకములో యిన్ని కోట్లమందికి పాశములు వేయాలంటే యమధర్మరాజుకు Rope factory లేదు. మన పుణ్యపాపములనే ropes మనమే తయారుచేసుకుంటున్నాము. ఆ పాశములచేత మనమే మనను బంధించుకుంటున్నాము. మనం బంధించుకున్న దానినే పట్టుకొనిపోతున్నారు దూతలు. కనుక మన దుష్కర్మలు, మన పవిత్రకర్మలు దీనికి మూలకారణంగా రూపొందుతున్నాయి. కనుకనే యింద్రియ నిగ్రహము గావించుకున్న మానవుని దైవమే సన్నిధికి చేర్చుకుంటాడు. అట్టి దగ్గరకు చేర్చుకున్న వ్యక్తికి పెన్నిధి భగవంతుడే! సన్నిధివల్ల

sri sathyasai vahanamrutam

భగవంతుని పెన్నిధి అనుభవించటానికి సాధ్యమౌతుంది. కానీ యీ పెన్నిధి, సన్నిధి యింద్రియ నిగ్రహమే. కనుక, యింద్రియ నిగ్రహము కలవాడు శమమును సులభముగా వశముగావించుకోగలడు.

**షడ్వికారములతోకూడిన ప్రతి పదార్థము అనిత్యమైనదే!**

ఇంక రెండవ గేటువాడు విచారణ. విచారణ అనేది ఎప్పుడు మనకు సంభవిస్తుంది? రెండు వస్తువులు చేరినప్పుడే విచారణ మనకవసరం. ఈ రెండిటిలోపల యేది సరైనదని మనం విచారణ ప్రారంభిస్తాము. బియ్యం, రాళ్లు చేరినప్పుడు బియ్యము యేవి, రాళ్లు యేవి అని విచారణ చేసి బియ్యమును మాత్రమే ప్రత్యేకముగా తీసుకుంటాము. ఈ విభాగమనేది ప్రతి మానవునికి అత్యవసరము. కోతికి అరటిపండు యిస్తే దానితోలునంతాతీసి మధ్యలో వుండే గుజ్జును మాత్రమే భుజిస్తుంది. లౌకికమైన ప్రతి పదార్థమును మనము విభాగం చేస్తున్నాము. అట్లే యీ విభాగయోగమనే విచారణయందు ఆత్మ, అనాత్మ విభాగం చెయ్యాలి. అదే విచారణ సల్పాలి. ఏది సత్యము, యేది అసత్యము, ఏది మంచిది, ఏది చెడ్డ, ఈ విచారణయందు మానవుడు సక్రమమైన మార్గాన్ని అనుసరించాలి. ఇందులో తగిన బుద్ధిబలమునుకూడను ప్రవేశపెట్టాలి. ఆ బుద్ధిని మనము చక్కగా ప్రవేశపెట్టినప్పుడే యింద్రియాలకతీతమైన స్థాయిని మనం పొందుతాము. ఈ ప్రాకృత సంబంధమైన వస్తువాహనాదులందు ఏది శాశ్వతము, ఏది అశాశ్వతము? అనుభవించే నేను శాశ్వతము. కానీ అనుభవింపబడే పదార్థములన్నీ అశాశ్వతమే! ఈ 'నేను' అనేది ఆత్మస్వరూపుడేగాని, దేహముకాదు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధబంధనల ముద్రలులేవు నిజంబుజూడ నా**
**దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ**

పుట్టు ప్రతి పదార్థమునకు గిట్టటమనేది వుంటుంది. ఏది పుట్టుక, చావులులేనిదో అదే సరైన



sri sathyasai vachanamrutam

స్వరూపము. దేహములన్నియు పుట్టేవే, పెరిగేవే! ఇవన్నీ షడ్వికారములతోకూడిన స్వరూపములే. అవే పుట్టుట, పెరుగుట, అభివృద్ధి గాంచుట, నశించుట, క్షీణించుట, అంతమగుట. కనుక, యీ షడ్వికారములతోకూడిన ప్రతి పదార్థము అనిత్యమైనదే! ఈ విచారణ చక్కగా సల్పి సత్యమైన ఆత్మతత్త్వాన్ని గుర్తించుకున్నవానికే రెండవగేటు కాపలాదారుడు స్వాగతమిచ్చి లోపల ప్రవేశింపజేస్తాడు. అట్లుకాక అనిత్యమైన దేహమునకు మరింత బంధములు చేకూర్చుకొని యీ రకమైన బంధనలలో దుఃఖములను, విచారములను అనుభవిస్తూ తాను చెడినదే కాకుండా మరొక జీవితాన్నికూడా చెరపటానికి ప్రయత్నించటము యీ విచారణకు విరుద్ధమైనది. కనుకనే నిత్యానిత్యవిషయపరిశీలన చేయటమనేది అత్యవసరము. అదే విచారణశక్తి.

**తనకు లభించినదానితో తృప్తిపడాలి**

ఇంక మూడవది తృప్తి. 'తనకున్న దానినుంచే తృప్తి గనుచుండు', అనగా తనకెంతవరకో అంతవరకు తృప్తి పడాలి. ఎవరికో ఒకనికి దారిలో పోతూవుంటే 99 రూపాయలు చిక్కాయి. నా అదృష్టవశాత్తు, భగవదనుగ్రహంవల్ల నాకీ 99 రూపాయలు చిక్కాయికదా అని సంతోషిస్తే యెంతో ఆనందం కల్గుతుంది. ఇంకొక్క రూపాయి చిక్కివుంటే వందరూపాయలౌనే అని అనుకుంటే మధ్య మార్గంలో యీ 99 రూపాయలుకూడా పోగొట్టుకుంటాడు. ఏదీ తనదికాదు. ఏదీ తన వెంటరాదు. తనవే అయితే తన వెంట యెందుకు రాకూడదు? ఏదో ఒక వ్యక్తి గోదావరినదిలో స్నానం చేస్తున్నాడు. ఆ ప్రవాహంలో బంగారుపిడివున్న ఒక కట్టి కొట్టుకుని వచ్చింది. చూచాడు ఆ కట్టిను. "ఆహా! నా అదృష్టమీనాడు పండింది. అందువల్లనే బంగారుపిడి నా చేతికి అందింది", అనుకున్నాడు. స్నానంచేసి తిరిగి దానిని తీసుకుందామని ఆ కట్టిను గట్టుపైకి విసిరాడు. తాను నీటిలో మునిగాడు, నమఃశివాయ నమఃశివాయ అని. ఇతను స్నానం చేస్తుంటే ఆ కట్టి క్రమక్రమేణా యెత్తుపల్లాలు వుండటంచేత పొర్లిపొర్లి వచ్చి నదిలో పడిపోయింది. తిరిగి అతను లేచి చూసేటప్పటికి ఆ బంగారుపిడికట్టిలేదు. ఒకటే బాధపడుతున్నాడు. "అయ్యో! నా బంగారు పిడికట్టి నదిలో కొట్టుకొని పోయెనే", అని బాధపడుతున్నాడు.

srisathyasaivahini.org

ఇదేమన్నా తనతాత సొత్తా? తను సంపాదించాడా? తాను తెచ్చుకున్నాడా? నదిలో చిక్కింది నదిలోకే పోయింది. ఇది నాది అనుకోటమే వీనికి ప్రధానమైన బంధన. రెండు నిమిషాలలోపల ఆనందాన్ని యిచ్చింది. మూడో నిమిషంలోపల దుఃఖానిచ్చింది. "పోనీ యీ రెండు నిముషాలైనా చేతికి చిక్కింది, ఆ బంగారు పిడిని చూశాను", అని సంతృప్తి పడితే యెంత ఆనందించేవాడు! నేను యింటినుండి తేలేదు అని సంతృప్తిపడేస్థితి వుంటే నిజంగా వానికి ఆ బంగారు కళ్ళు మిగిలి వుండేది. ఈనాడు ప్రతి ఒక్కడు లక్షాధికారి, కోటీశ్వరుడు కావాలని ఆశిస్తున్నాడు. ఆ కోటీశ్వరుడైనవాడు ఇంకా కావాలని ఆశిస్తున్నాడు. ఒక్కతూరి పంచాయతి ప్రెసిడెంటు అయితే తిరిగి MLA కావాలంటాడు. ఈ MLA అయ్యాక Minister కావాలంటాడు. ఇంక Minister అయ్యాక M.P. కావాలంటాడు. దాని తర్వాత Prime Minister కావాలని ఆశిస్తాడు. లభించిన దానిని తృప్తిగా అనుభవించి తన కర్తవ్యాన్ని తాను నిర్వర్తించుకొనే స్థితిగతులను వాడు యేమాత్రము యోచించడు.

**తృప్తి ప్రతి మానవునికి అత్యవసరము**

యీనాడు ప్రతిమానవుడు అసంతృప్తుడు కావటంచేత రైట్సుకు మాత్రం ఫైట్ చేస్తున్నాడు. కాని responsibilities చూడటంలేదు. కనుకనే అసంతృప్తిగా మారిపోతున్నాడు. జీవితమంతా యీ అసంతృప్తిలోనే సొక్కి సొల్లి కూలిపోతున్నాడు. కనుక, తృప్తి ప్రతి మానవునికి అత్యవసరము. అటువంటివాడే లోకానికంతా గొప్పవాడు. శంకరాచార్యుడుకూడను 'ఎవరు గొప్పవాడు యీ లోకంలో', అని ప్రశ్న వేసుకున్నాడు. Who is the richest man in this world? He who has much satisfaction is the richest man. Who is the poorest man in this world? He who has many desires is the poorest man. కనుకనే మనం ఉన్నతస్థాయికి పోవాలి, దైవస్థానాన్ని పొందాలి అనుకున్నప్పుడు యీ సంతృప్తి అనేది అత్యవసరము. వివేకానంద, రామకృష్ణ పరమహంస, తులసీదాసు, రామదాసు, కబీర్‌దాసు యిలాంటి దాసులందరు పూర్వము యీ విధముగనే జీవితాన్ని గడపుతూ వచ్చారు. వారికి ఒక్కొక్క సమయములోపల భుజించటానికి యేమాత్రము ఆహారము చిక్కేదికాదు. అప్పుడు "భగవంతుడు నాకు చక్కని అవకాశమందిస్తున్నాడు, వుపవాసదీక్షలో నన్ను చేరమని భగవంతుడాదేశిస్తున్నాడు. యిది

sri sathyasai vachanamrutam

యెంత అదృష్టము", అనుకుని వుపవాసంలోపల వారు ఆనందాన్ని అనుభవించేవారు. ఒకనాడు పంచభక్ష్యపరమాన్నములతో, అన్ని విధములైన పిండివంటలతో భోజనం లభించినప్పుడు "భగవంతుడీనాడు నన్ను వుపవాసం త్యజించి నాయనా చక్కగా ఆరగించమని పంపాడు", అని దీనికి, దానికి రెండింటికి తృప్తి పడుతూ వచ్చేవారు. తినటానికి తిండీ, వంట్లో శక్తి లేని సమయములో కృంగిపోటంగాని, శక్తిసామర్థ్యములన్నీ చేకూరినప్పుడు పొంగిపోటంకాని యీ రెండు ప్రమాదమని చెప్పి భావించారు. కనుకనే 'సమత్వం యోగముచ్యతే' అన్నారు, ఆనాటి మహర్షులు. యిలాంటి సమత్వాన్ని మనకు బోధించారు. సమత్వాన్ని అనుభవించాలి. సమత్వాన్ని లోకానికి అందించాలి. ఇదే తృప్తికి చిహ్నము. ఇట్టి తృప్తి కల్గినవాడు భగవత్ సన్నిధిని, పెన్నిధిని అనుభవించటానికి అధికారి కాగలడు.

**మంచివారితో చేరిన చెడ్డవారికికూడను విలువహెచ్చుతుంది**

ఇంక నాల్గవది సత్సంగము. ఈ సత్సంగమనేది యీనాడు యువకులకు అత్యవసరం. చెడ్డ అభ్యాసములు, చెడ్డ ప్రవర్తనలతోకూడినవారితో మనం స్నేహము చేస్తూవుంటాము. దానివల్ల మనంకూడా చెడ్డవారుగా మారిపోతున్నాము. ఈ దుస్సంగాన్ని దుడ్డు అయినా పెట్టి మనం దూరం చెయ్యాలి. సత్సంగాన్ని సర్వమూ యిచ్చి స్వాధీనం చేసుకోవాలి. దీనికి చక్కని ఉదాహరణము. చీకటి రాత్రిలో దట్టమైన అరణ్యములో ప్రయాణం చేస్తున్నప్పుడు లాంతరు పట్టుకొనిపోయేవానితో కలసి మనంకూడ ప్రయాణంచేస్తే సులభంగా మనం దారిని చూడగలము. కాని, యిద్దరుకూడను దీపములేకుండా ప్రయాణముచేస్తే, యిద్దరూ చిక్కుబడిపోతారు. లైట్ వున్నవానితో కలసి ప్రయాణముచేస్తే మనముకూడా క్షేమముగా గమ్యాన్ని చేరతాము. అదే విధముగా సద్గుణములు, సదాచారములు, సత్ప్రవర్తన, సత్సంగము వుండినవానితో మనంకూడా చేరితే ఉన్నత స్థాయిని పొందుతాము. మంచివారితో చేరిన చెడ్డవారికికూడను విలువహెచ్చుతుంది. చెడ్డవానితో చేరిన మంచివాడు విలువ కోల్పోతాడు. చిన్న ఉదాహరణ. పదిలీటర్ల పాలు వున్నాయి. ఒక్కొక్క లీటరు నాల్గురూపాయల చొప్పున దానికి విలువ నిస్తున్నారు. దీనివల్ల నలభై రూపాయలు

sri sathyasai vachanamrutam

అతనికి చేరుతుంది. ఒక లీటరు వాటర్ వున్నది. ఒక్క లీటరు వాటర్‌కి ఒక్క నయాపైసకూడా యివ్వరు. ఎక్కడైనా ఎడారిలో వుంటే కొంటారేమోకాని సామాన్యముగా ఒక లీటరు వాటర్‌కి విలువనివ్వరు. కానీ ఒక లీటరు వాటరు పది లీటర్ల పాలతో చేరేటప్పటికి పదకొండు లీటర్ల పాలగా తయారై దానికి విలువనిస్తారు. అక్కడ వాటర్ అని పేరు పెట్టరు. పదకొండు లీటర్ల పాలు అంటారు. కనుక, మంచి విలువైనదానిని యీ విలువలేని నీటిలో కలిపేటప్పటికి నీటికికూడ విలువ వచ్చింది. పది లీటర్ల వాటర్ వుందనుకోండి. ఒక లీటరు పాలువుంది. ఈ ఒక లీటరు పాలకు నాల్గు రూపాయలిస్తారు. కానీ యీ పది లీటర్ల నీటితో చేరితే దీని విలువ పోతుంది. దీన్ని వాటర్ అంటారు కాని పాలు అనరు. అదే విధముగనే పదిమంది మంచిపిల్లలలో ఒక చెడ్డపిల్లవాడు చేరినా పదకొండవ పిల్లవాడు మంచివాడౌతాడు. అదే రీతిగా కాకుండా పదిమంది చెడ్డపిల్లలతో ఒక మంచివాడు చేరితే వీడు పదకొండవ దొంగగా తయారౌతాడు. కనుక, మనం స్నేహం చేయాలనుకున్నప్పుడు సత్ప్రవర్తనతో, సచ్చింతనతో, సదాలోచనతో, సద్భావములతోవున్నవానితో స్నేహం చేయాలి. లేకపోతే Hello Hello, how are you? good bye అంటే చాలు. వారితో మనకు ద్వేషమూ వద్దు, స్నేహము వద్దు. ఈనాడు చాలామంది పిల్లలు యీ నిత్యానిత్య విషయపరిశీలన చేసే విచారణశక్తి లేకపోవటంచేతనే దుస్సంగముతో చేరి, దుర్బుద్ధులలో మునిగి తమ జీవితాన్నంతా దుర్వినియోగం చేసుకుంటున్నారు.

**అనంతమైన భగవత్తత్త్వమును పొందటమే సుఖము**

కనుక మనము శమము, విచారణ, తృప్తి, సత్సంగము యీ నాల్గు ద్వారములు సులభంగా దాటినప్పుడు దైవత్వము మనలోనే ఆవిర్భవిస్తుంది.

**దేవుడనగ వేరు దేశమందున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తనదు చేయు పనుల తగిలియుండు**

srisathyasaivachanamrutam

పాపములంటే యే దేశమునుండియో, యెక్కడనుండియో వూడిపడవు. మనం చేసే పనులలోనే పాపముంటుంది. ఇక్కడ పాపి అనగా యెవరు? Hero becomes zero if he forgets God. వాడు పాపి. మానవునిగా మనము పుట్టి దైవత్వాన్ని మరవటమే పెద్దపాపం! ఈ దైవత్వాన్ని మరచినవాడు దానవత్వంలో చేరిపోతాడు. దానవత్వముతో కూడినవాడు దయాదాక్షిణ్యములను పూర్తిగా విసర్జిస్తాడు. మనలో వున్న సద్గుణాలను పోషించుకోటానికి దుర్గుణాలను దూరం చేయుటయే సరియైన పద్ధతి. "తస్మై నమఃకర్మణే" అన్నారు. భగవంతునికి ఒక్క రూపములేదు. ఒక్క నామములేదు. అలాంటి పరిస్థితిలో ప్రప్రథమములో ఋషులందరు చేరి "తస్మై నమఃకర్మణే" అన్నారు. "ఓ సుఖస్వరూపుడైన భగవంతుడా! నీకు నమస్కారము" అన్నారు. ఇక్కడ సుఖమంటే యేమిటి? సుఖమంటే గొప్ప భవనాలు కట్టుకొని, సర్వానుకూలములు చేర్చుకొని, పంచభక్ష్యపరమాన్నములతో పొట్టను పెంచుకొని యిష్టం వచ్చినట్లు జీవించటం సుఖముకాదు. ఇది దేహసంబంధమైన సుఖము, దైహికమైన సుఖము. సు-మంచి. ఖ-విశాలమైన. మ్-అనంతమైన. "మంచి అనంతమైన తత్త్వాన్ని పొందటమే సుఖము" అన్నారు.

**గొప్పతనానికి మన నడతయే ప్రధానము**

తంజావూరు మహరాజు వజ్ర, వైఢూర్య, మాణిక్య, మరకత, గోమేధ, పుష్యరాగములతోకూడిన నగలు, నాణ్యాలు అంతా తెచ్చిపెట్టినప్పుడు త్యాగరాజు చెప్పాడు: 'నిధి చాల సుఖమా ఈశ్వర సన్నిధి చాల సుఖమా! నిజముగా తెలుపవె ఓ మనసా', అన్నాడు. ఓ మనసా! 'నిధిసుఖమా రాముని సన్నిధి సుఖమా చెప్పుము' అన్నాడు. అనంతమైన దైవత్వాన్ని అనుభవించటమే మనకు సుఖము. ఈనాడు గొప్పగొప్ప బిరుదులంతా తీసుకొని, గొప్ప చదువులన్నీ ఆర్జించి, పెద్దపెద్ద అక్షరాలతో పదిపన్నెండు డిగ్రీలంతా పెట్టుకొని యేదో ఒక వుద్యోగమునకు మనము వెడుతున్నామంటే, వీడు యెంత గొప్ప వాడురా అనుకుంటారు. ఈ గొప్పతనానికి అక్షరాలు కాదు ప్రధానము, గొప్పతనానికి మన నడతయే ప్రధానము.

ఒక మధ్యతరగతికి చెందిన వ్యక్తి వుండేవాడు. అతనికి యింటిలో అనేక కష్టాలంతా

sri sathyasai vachanamrutam

అభివృద్ధి అయ్యాయి. క్రమక్రమేణా కాలకర్మకర్తవ్యాలు కలసిరాక పోవటంచేత పరిస్థితులు దినదినమునకు క్షీణించిపోతున్నాయి. ఆ సమయములో ఒక వైశ్యుడు ఒక కొట్టులోపల మంచి బియ్యము. బేడలు యివంతా పెట్టుకొని పెద్దవ్యాపారిగా ఎదగడాన్ని ఇతడు గమనించాడు. ఇతని దగ్గరకు పోయి సహాయం పొందితే తన కుటుంబాన్ని ఎలాగైనా పోషించుకోవచ్చని అతనికొక పెద్ద జాబురాసాడు. అతనిపేరు సచ్చిదానందం అనుకోండి! అయితే, పేరు సచ్చిదానందంగాని ఆనందం యెక్కడ వెతికినా చిక్కటంలేదుపాపం అతనికి. దానిపైన అడ్రస్సు వ్రాసాడు. శ్రీశ్రీశ్రీ సచ్చిదానందం, F.F.S, F.T.D అని డిగ్రీలు వ్రాసాడు. షాహుకారు చూచాడు. ఏమిటి యింత డిగ్రీలు తీసుకున్నవాడు నా కొట్టులో యేదో పని చేస్తానన్నాడే అని పిలిపించాడు పాపం. "ఏమయ్యా! యింత పెద్ద డిగ్రీలు తీసుకున్నావు. నా కొట్టులో యేమి పని చేయగలవు, ఏమేమి ప్యాస్ అయ్యావ"ని అడిగాడు. F.F.S అంటే Father of Five Sons. F.T.D అంటే Father of Ten Daughters అన్నాడు. ఇదే వాని qualification. మనం ఉపయోగం లేని డిగ్రీలన్నీ ఈనాడు తగిలించుకుంటున్నాము. కనుక, మన పేరు చివర ఉన్న అక్షరాలు డిగ్రీలుగా తీసుకోటంకాదు ముఖ్యం, మన ప్రవర్తనలో దానిని నిరూపించాలి. అక్షరాలకేమాత్రం విలువలేదు.

**జీవబ్రహ్మైక్యానుసంధానమే అక్షరము**

నీ యొక్క క్షరాన్ని అక్షరంతో లీనం చెయ్యాలి. నీ క్షరము క్షేత్రము. అక్షరము క్షేత్రజ్ఞుడు. అక్షరమనగా జీవ బ్రహ్మైక్యానుసంధానము అని దీని అర్థము. అఖండమైన, అనంతమైన, అమృతత్వమైన తత్త్వానికి అకారమనేది ఆత్మస్వరూపము. క్షరమనగా నశించిపోయేది, క్షీణించి పోయేది, దుఃఖమునకు గురయ్యేది. అనిత్యమైన క్షరము, నిత్యమైన ఆకారము ఈ రెండింటి చేరికయే అక్షరము. జీవుడు, దేవునితో కూడినప్పుడే అక్షరస్వరూపుడౌతాడు. జీవుడు క్షరము. దేవుడు ఆత్మస్వరూపము. కనుకనే తులసీదాసుకూడను చెప్పాడు. అకార, రకార, మకారములయొక్క తత్వమును గురించి యోచించుతూ 'కుశానుభానుహిమకరతే' అన్నాడు. కుశ, భాను, హిమకరతే. కుశుడనగా అగ్ని, భానుడనగా సూర్యుడు, హిమమనగా చంద్రుడు. ఈ విధంగా "అగ్నిసూర్యచంద్రాదులతోకూడిన నామము నీ



srisathyasai vahanamrutam

నామము, రామచంద్రా!" అన్నాడు. రామ-రా, అ, మ. 'రా' అనగా అగ్ని, పాపములను భస్మం చేస్తుంది. 'అ' అనగా సూర్యుడు. సూర్యుడనగా అంధకారాన్ని నిర్మూలం గావిస్తాడు. 'మ' అనగా చంద్రుడు. తాపమును చల్లార్చి ఆనందాన్ని చేకూరుస్తాడు. కనుక, "పాపమును నిర్మూలం చేసి, అజ్ఞానము దూరం గావించి, నా తాపాన్ని చల్లార్చే ఓ రామచంద్రా!", అని పిలిచాడు. "కుశానుభానుహిమకరతే" అని టైటిల్ యిచ్చాడు. దీనిని బట్టి తాము చేసే పనులను బట్టి డిగ్రీలుగాని, కేవలం పనులు చేయకుండా డిగ్రీలుమాత్రం పెంచుకోటం అది పెద్ద స్టంట్ అని చెప్పవచ్చును. కనుక, డిగ్రీలతోపాటు సత్ప్రవర్తనకూడను మనం నిరూపించాలి. ప్రతీ విద్యార్థి క్రమక్రమేణా యీ యింద్రియాలను నిగ్రహించుకోటానికి ప్రయత్నించాలి. ఇలాంటి ప్రయత్నంచేత మనము దైవానుగ్రహాన్ని యెంతైనా సాధించటానికి అవకాశముంటుదని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 19-2-1987న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam